క్లుప్తంగా

ఆత్మకూర్ ఎంపీఓగా శ్రీరాంరెడ్డి



ఆత్మకూర్: మండల పరిషత్ అధికారిగా ఉద్యాల శ్రీరాంరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీఓగా విధులు నిర్వహించిన నర్సింగ్‌రావు జనగామ జిల్లాకు బదిలీపై వెళ్లారు. పెద్దమందడి మండల ఎంపీఓగా పనిచేస్తున్న శ్రీరాంరెడ్డి బదిలీపై ఆత్మకూర్ ఎంపీఓగా విధుల్లో చేరారు. ఈసందర్భంగా శ్రీరాంరెడ్డిని సిబ్బంది, కార్యదర్శులు సత్కరించారు.

పాఠశాల సందర్శన

పెబ్బేర్‌రూరల్: మండలంలోని అప్పాయిపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీడీఓ రాఘవ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎక్కాల పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి వనమహోత్సవానికి అవసరమగు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా గుంతలను తవ్వించాలని ఆయన కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుదర్శన్, పాఠశాల హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు కృషి

వీపనగండ్ల: పాఠశాలలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాష్ అన్నారు. గురువారం గోపల్‌దిన్నె, గోవర్ధనగిరి, రంగవరం ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థులు ఉత్తమంగా రాణించేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వెనకబడ్డ విద్యార్థులు విద్యలో రాణించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

ఆత్మకూర్: అపరచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదని, ఓటీపీ తదితర వివరాలను ఇవ్వకూడదని సీఐ శివకుమార్, ఎస్ నరేందర్ సూచించారు. గురువారం మండలంలోని ఆరేపల్లిలో సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్‌నేరాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు బీచుపల్లి, రోషన్న, గ్రామస్తులు ఉన్నారు.

జూరాల వద్ద పోలీసు పహారా



అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీస్థాయిలో వరదనీరు వచ్చి చేరుకుంటుండడంతో జూరాల నుంచి దిగువకు 46 క్రస్టు గేట్లను ఎత్తి 2.29లక్షల క్యూసెక్కుల నీటిని కిందకి వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో కృష్ణానది ఉగ్రరూపంలో ప్రవహిస్తుండటంతో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఎస్పీ ఆదేశాల మేరకు అమరచింత పోలీసులు నిత్యం పహారా కాస్తున్నారు. ప్రాజెక్టు సందర్శనకు హైదరాబాద్‌తో పాటు సమీపంలోని కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్ నుంచి నిత్యం పర్యాటకులు వస్తున్నారు. కేవలం జూరాల ప్రధాన ఎడమ కాల్వ వద్ద పర్యాటకులు బస చేయడానికి, వారి వాహనాలను నిలుపడానికి అనుమతిస్తున్నామని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు.

సెల్ఫీల మోజులో యువత..

ప్రాజెక్టు దిగువన కృష్ణానది పరవళ్ల వద్ద యువకులు రీల్స్, సెల్ఫీల మోజుతో పోలీసుల కళ్లు కప్పి ఇతర మార్గాల వెంట నది చెంతకు చేరి ప్రవహించే నీటి వద్ద ప్రమాదకర స్టంట్లు చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా ఇలాంటి సాహసాలు చేస్తుండటం ఏమిటని, పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

రైతుల భవిష్యత్‌కు భరోసా

కొత్తకోట రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో రైతాంగం అభివృద్ధికి అడుగులు వేశారని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే రైతాంగానికి సముచిత గౌరవం దక్కిందన్నారు. 2024–25 వార్షిక బడ్జెట్ రూ.2,91,159 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు రూ.72,659 కోట్లు, ఉద్యానవనానికి రూ.737 కోట్లు, సాగునీటి రంగానికి రూ.26కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,980కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.22,301కోట్లు కేటాయింపులు చేసి అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీనివాసులు, పి.మోహన్‌రెడ్డి, గంగుబాల్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.



విద్యారంగానికి నష్టం



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసింది. పేద విద్యార్థులు చదువుకునే విద్యాలయాలు బలోపేతం కావాలంటే సరిపడా నిధులు కేటాయించాలని. కానీ రాష్ట్ర ప్రభుత్వం 7.31 శాతం మేర విద్యారంగానికి కేటాయించడం సరైంది కాదు. విద్యావంతులు, మేధావులు, ప్రజాసంఘాలతో చర్చిస్తున్నామని చెప్పే కాంగ్రెస్ పార్టీ అందుకు విరుద్ధంగా వ్యవహరించింది.

– యోసేపు, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్

షరతులు ఉండొద్దు..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు అమలు చేస్తామన్నా పథకాలకు షరతులు విధించకుంటే ప్రయోజనం కలుగుతుంది. రైతు భరోసా, రైతుబీమా, పండించిన పంటలకు రూ.500 బోనస్, బిందు సేద్యానికి సబ్సిడీ తదితర రైతు పథకాలకు షరతులు విధించడం సరికాదు.

– మహబూబ్‌పాషా, రైతు, గోవర్ధనగిరి

30 శాతం నిధులు అవసరం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 7.31 శాతం నిధులు కేటాయించడం దారుణం. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ప్రజా ప్రభుత్వం పేరుతో నట్టేట ముంచుతున్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి.

– వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

స్వాగతిస్తున్నాం..



2024–25 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్య, వైద్యరంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నాం. గత పదేళ్లలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వెచ్చించకపోవడంతో ఆయా వర్గాలు దారిద్ర్యం నుంచి బయటపడలేదు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలి.

– పుట్టా ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి, సీఐటీయూ

రైతు పక్షపాతి బడ్జెట్..



రాష్ట్ర బడ్జెట్ రైతు, బడుగు, బలహీల వర్గాల అభివృద్ధిని కాంక్షించి రూపొందించింది. రాష్ట్రంలో 90 శాతం ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం గడుపుతున్నందునే బడ్జెట్‌లో అగ్రభాగం వ్యవసాయ రంగానికి కేటాయించారు. మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కొత్త పథకంతో పాటు నిధుల కేటాయింపులు కావాల్సిన మేర చేశారు.

– రాజేంద్రప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు, వనపర్తి

మొక్కలతోనే మానవాళి మనుగడ



కొత్తకోట పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఐ రాంబాబు, ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, సిబ్బంది

కొత్తకోట రూరల్: మొక్కలు మానవాళి మనుగడకు ఎంతో దోహదపడుతాయని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, సిబ్బందితో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెట్లు వాతావణాన్ని కలుషితం కాకుండా, జీవకోటికి ప్రాణవాయువును అందిస్తూ పర్యావరణాన్ని కాపాడుతాయన్నారు. చెట్లు అంతరించిపోతే ఉష్ణోగ్రతలు పెరిగి జీవుల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సాగర్, హెడ్‌కానిస్టేబుళ్లు కుర్మయ్యగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు వెంకటస్వామి, మురళీధర్‌రెడ్డి, మాధవ, వెంకటేశ్వర్‌రెడ్డి, రవి, రాము, రాజు తదితరులు ఉన్నారు.

వనపర్తి టౌన్: మొక్కలు పెంచితేనే పర్యావరణాన్ని పరిక్షించుకోవచ్చని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి 150 మొక్కలు నాటారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



పోచమ్మ ఆలయం వద్ద బోనాలతో ప్రదక్షణలు చేస్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలం కేంద్రంలోని బెస్తగేరిలో గురువారం పోషమ్మ, మైసమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కాలనీలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయం వద్ద బుధవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన గంగపుత్రులు గురువారం ఉదయం నుంచి ఆలయం వద్ద పూజలు నిర్వహించడంతో పాటుగా తెప్పోత్సవం, పోషమ్మ, మైసమ్మకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సమయంలో మహిళలు కుంకుమ, పసుపు, గంధం, వేపాకు, పూలు తదితర వాటితో అందంగా తయారు చేసిన బోనంలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్న మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వనపర్తిని అంధకారం చేయొద్దు



కమిషనర్‌తో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ

వనపర్తిటౌన్: పట్టణంలో చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎందుకు చర్యలు చేపట్టడం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ కమిషనర్ పూర్ణచందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలో చేపట్టాల్సిన పలు ప్రాధాన్యత అంశాలపై కమిషనర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కౌన్సిల్ సమావేశంలో వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పుడెందుకు చేతులెత్తేస్తున్నారని, మీ నిర్లక్ష్య వైఖరితో పురపాలికకు చెడ్డ పేరు వస్తుందని మండిపడ్డారు. కౌన్సిల్ సమావేశంలో వీధి దీపాలు అవసరమైన చోట ఏర్పాటు చేస్తామని చెప్పినట్లు కమిషనర్ పూర్ణచందర్ అంగీకరించారు. వీధి దీపాల ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్న కంపెనీకి సుమారు రూ.2 కోట్ల వరకు బకాయిలు ఉండటంతో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టలేకపోతున్నామని కమిషనర్ బదులివ్వగా.. ప్రజా ప్రయోజనాల కోసం ఏదో ఒక దారి ఉంటుందని, అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు మేలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పలు కాలనీల్లో తెగిపోయిన వాటర్ లైన్ కనెక్షన్‌లను వెంటనే అమర్చాలన్నారు. గాంధీచౌక్‌లో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

ఫ్లెక్సీల తొలగింపుపై ఆగ్రహం..

పట్టణంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన రెండు రోజులకే తొలగించడంపై లక్కాకుల సతీష్ కమిషనర్ పూర్ణచందర్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతోనే తొలగిస్తున్నామని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న 20 మంది కార్మికులకు జీవనోపాధికి అవరోధాలు కలిగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన తిక్క రాముడు 15రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో గ్రామానికి చెందిన యువకులు మానవతా దృక్పథంతో రూ.30వేలు చందాలు పోగు చేసి గురువారం తిక్క రాముడు తల్లిదండ్రులకు అందజేశారు. మృతుడి తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని చూసిన యువకులు చలించిపోయి డబ్బులు చందాల రూపంలో పోగు చేశారని, అంతే కాకుండా రాముడు అంత్యక్రియలు సైతం తామే చేశామన్నారు. కార్యక్రమంలో కురుమూర్తి, సిద్ధార్థరాజు, నిరంజన్, రాజశేఖర్, భాను, శేఖర్, సన్నీ, ఎం.శేఖర్, నాగరాజు, గోపాల్, భీముడు, స్వామి, శివ, కార్తీక్, విష్ణు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు చేయూత

పెబ్బేరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కిషోర్, ఈడీఎస్‌సీ కార్పొరేషన్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో గురువారం బ్యాంకర్లు, పెబ్బేరు, వీపనగండ్ల, పాన్‌గల్, చిన్నంబావి ఎంపీడీఓల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ దిలీప్ మాట్లాడుతూ గ్రామీణ పేద యువతను గుర్తించి చైతన్య వంతులను చేయుట, వారికి తగిన శిక్షణ, సలహాలనిచ్చి స్వయం ఉపాధి పొందేందుకు ప్రోత్సహించుట, యువశక్తి ద్వారా ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యాపారాభివృద్ధికి సహకరిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, వసతి, భోజనం, మెటీరియల్, యూనిఫాం, టూల్‌కిట్ ఇస్తామని, బాలికలకు, బాలురకు వేర్వేరు సమయాల్లో శిక్షణ ఇవ్వబడును.

‘భగీరథ’ నీటి సరఫరాలో అంతరాయం

పాన్‌గల్: ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని ఒక పక్క జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడతున్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో 20 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. కాలనీ ప్రజలు ఉప్పునీటిని తాగుతూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి కాలనీకి మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాల్సిన క్షేత్ర స్థాయి ఇబ్బంది ఈ కాలనీకి 20 రోజులుగా చుక్క నీరు అందకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు మిషన్ భగీరథ సంపు నుంచి మండల కేంద్రంలోని నాలుగు నీటి ట్యాంకులకు నింపాల్సి ఉండగా.. సిబ్బంది దానికి చొరవ చూపకపోవడంతో నీటి సరఫరా అంతరాయం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరగా ఎస్సీ కాలనీకి సరఫరా చేసే బోరు మోటార్ మరమ్మతుకు నోచుకోకపోవడంతో బీసీ కాలనీకి నీటి సరఫరా నిలిచిపోయిందంటున్నారు. వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించి కాలనీవాసుల ఇబ్బందులను తొలగిస్తామన్నారు.

7 ద్విచక్ర వాహనాలు సీజ్



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 7 మోటార్ సైకిళ్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మోటార్ సైకిళ్లకు నెంబర్ ప్లేట్ లేకపోవడం, కనిపించకుండా ఉండటం, రిజిస్ట్రేషన్ లేని ఏడు వాహనాలను తనిఖీల్లో గుర్తించి సీజ్ చేశామని పేర్కొన్నారు. ఎవరైనా వాహనదారులు నెబర్ ప్లేట్ లేకుండా, రిజిస్ట్రేషన్ లేకుండా రోడ్లపైకి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది బొట్టు శ్రీను, మునిస్వామి పాల్గొన్నారు.

ఖాతాల్లో డబ్బు జమ చేయండి

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష లోపు గల వ్యవసాయ రుణాలను మాఫీ చేసిందని, వీటిని బ్యాంకు అధికారులు రైతుల ఖాతాల్లో జమచేయాలని మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈమేరకు సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజన్న, రాజు, సామెలు, భక్తరాజ్, ఏసన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు కేటాయించాలి

కొత్తకోట రూరల్: పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని భారతీయ విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నం భోజనం, రాగి జావా, అల్పాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న డబ్బులు ఇప్పటి వరకు వంట వర్కర్లకు చెల్లించలేదని, దీంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజనం నిధులు విడుదల చేయడంతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాజవర్ధన్ ఉన్నారు.

సర్వే చేసి నిధులు ఇవ్వరా?



మాట్లాడుతున్న బి.కృష్ణ

వనపర్తి టౌన్: వనపర్తి మీదుగా డోర్నకల్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేసేందుకు రూ.7.55 కోట్లతో సర్వే పూర్తి చేసి పనుల ప్రారంభానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు బి.పరశురాం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. వనపర్తితో పాటుగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు అనుసంధానం చేస్తూ గతేడాది సర్వే పూర్తి చేసి పనుల ప్రారంభానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం పాలమూరుపై బీజేపీకి ఉన్న వివక్షకు అద్దం పడుతుందన్నారు. రెండు దశాబ్దాలుగా వనపర్తి ప్రజలు రైల్వే సాధన కోసం ఉపవాస దీక్షలు, పోరాటాలు, పోస్ట్ కార్డు ఉద్యమాలు, ఎన్నో రకాలుగా ప్రజా పోరాటాలు చేసినా పాలకులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. వనపర్తికి రైల్వే లైన్ సాధన కోసం పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ సారథ్యంలో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని, అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ సంస్కృతిని విద్యార్థులకు నేర్పించాలి

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ సంబరాల్లో విద్యార్థులను భాగస్వాములను చేసి, వారికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చాలని ఎంఈఓ ఉషారాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలుగు, ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఆమె పరిశీలించారు. శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా నాల్గో రోజు ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు కొత్త, పాత పాటలను పాడటంతో పాటుగా పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో అధికారులు లలిత, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లపై కేజీవీల్స్‌తో నడిపితే చర్యలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల్లో బీటీ రోడ్లపై కరిగెట చేసే కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ శివకుమార్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశానుసారం పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి బీటీ రోడ్లు వేస్తే కొందరు రైతులు, ట్రాక్టర్ల యజమానులు నిర్లక్ష్యంగా కరిగెట చేసేందుకు కేజీవీల్స్‌తో రోడ్డుపై వెళ్తుండటంతో రోడ్డు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలకు రోడ్డు బాగుంటే రాకపోకలు సులభంగా ఉంటాయని, రోడ్లు సరిగ్గా లేకుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పోలీసుల సూచనలు ధిక్కరించి కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్డుపై నడిపితే భారీ జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినపతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి పంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వేతనాలు మంజూరు చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడుతూ 2023 సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ అదే విధంగా 2024లో జనవరి, ఫిబ్రవరి, జూన్ నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వేతనాలు మంజూరు చేయాలన్నారు. కార్మికులు చాలిచాలనీ వేతనాలతో పనిచేస్తున్నా ఇచ్చే జీతం నెలనెల ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, బొజ్జన్న, శాంతన్న, బాలరాజు తదితరులు ఉన్నారు.

పింఛన్లు ఇవ్వాలని రాస్తారోకో



ఆత్మకూర్: పెన్షన్ డబ్బులు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు గురువారం స్థానిక గాంధీచౌక్‌లో రాస్తారోకో నిర్వహించారు. పోస్టాఫీసులో ప్రతిరోజు ఇద్దరికీ పెన్షన్ డబ్బులు ఇచ్చి నెట్‌వర్క్ పనిచేయడం లేదని, సర్వర్ డౌన్ అయ్యిందని ఉదయం నుంచి సాయంత్రం దాక పడిగాపులు కాస్తున్నా తమను తిరిగి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌ను పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం



జిల్లా నాయకులను సన్మానిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేసేందుకు మండలంలోని కార్యకర్తలు సంసిద్ధులు కావాలని బీజేపీ జిల్లా నాయకుడు పురుషోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మండలంలోని గుమ్మడంలో బీజేపీ మండల అధ్యక్షుడు నేతుల నారాయణ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, వనపర్తి నియోజక కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గొని వేమారెడ్డి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందితే, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, గోవిందు, శివసాయి, కుబేర్, శ్రీసాయి, వీరశేఖర్, వీరస్వామి, రామయ్య ఉన్నారు.

ముందస్తు అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

అమరచింత: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తే అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ చలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా బీజేవైఎం, బీజేపీ నాయకులను గురువారం తెల్లవారుజామున అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రాకేష్ శెట్టి, మేర్వ అనిల్, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

ఖిల్లాఘనపురం: ముందస్తు అరెస్టులతో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను అడ్డుకోలేరని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేయనందుకు గాను గురువారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చారని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆదేశంతో గురువారం తనతో పాటుగా ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్నలను పోలీసులు తమ ఇళ్ల వద్దే ముందస్తు అరెస్టు చేయడం సమంజసం కాదని వాపోయారు.

‘వీరారెడ్డి సేవలు మరువలేనివి’



అమరచింతలో వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

ఆత్మకూర్: మాజీ ఎమ్మెల్యే, ఆప్కాబ్, డీసీసీబీ మాజీ చైర్మన్ వీరారెడ్డి జయంతి సందర్భంగా ఆత్మకూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక సాయివాణి ఫంక్షన్‌హాల్‌లో వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వీరారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని, రైతులకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, గంగాధర్‌గౌడ్, గణేష్‌ముదిరాజ్, పుల్లరి మంజుల, మహేశ్వర్‌రెడ్డి, విజయలక్ష్మి, అనిత, హరీష్‌గౌడ్, విణయ్‌రెడ్డి, జబ్బార్, ఈర్లదిన్నె శ్రీను, ఖాజన్న, రవీందర్, షబ్బీర్, గాండ్ల రఘు, వెంకటన్న, నర్సింహ, బుచ్చన్న, మహంకాళి విష్ణు, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలు నేటికీ పదిలంగా ఉన్నాయని కాంగ్రెస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కె.ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీటీసీలు మహంకాళి విష్ణు, తిరుమలేష్ మాట్లాడుతూ వీరారెడ్డి అమరచింత నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారన్నారు. అనంతరం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్డు అందించారు. కార్యక్రమంలో జుబేర్‌అహ్మద్, మన్నాన్, జాన్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజా వ్యతిరేక బడ్జెట్

సాక్షి, నెట్‌వర్క్: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య, పేదలు, కార్మికులకు ఎటువంటి ఉపశమనం కలిగలేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, శ్రీహరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సీఐటీయూ, సీపీఐ ఆధ్వర్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆహారం, వంట గ్యాస్, పెట్రోలియం, యూరియా వంటి వాటికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు.

నలుగురికి జైలు

వనపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడిన నలుగురికి జైలుశిక్ష విధిస్తూ వనపర్తి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీలత గురువారం తీర్పునిచ్చారు. ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన పోలీసుల వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ నలుగురు పట్టుపడ్డారు. అందులో ఇద్దరికి రెండురోజులు, మరో ఇద్దరికి ఒకరోజు జైలుశిక్ష విధించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

ఆత్మకూర్: పట్టణంలోని ముస్లింల ఖబ్రస్తాన్‌లో సమాధుల ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం, ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకుల బృందం శ్మశాన వాటికను సందర్శించి తహసీల్దార్ రాజు, కమిషనర్ నాగరాజుతో వేర్వేరుగా సమావేశమయ్యారు. కొంత మంది స్వార్థంకోసం వెంచర్లు చేసేందుకు వందల ఏళ్లనాటి సమాధులను జేసీబీల సాయంతో ధ్వంసం చేస్తున్నారని, ఘటన జరిగి వారం రోజులు అవుతున్నా నిందితులను గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం, ఆవాజ్‌కమిటీ నాయకులు ఎస్ రాజు, ఆర్‌ఎన్ రమేష్, వెంకటేష్, అజయ్, బుచ్చన్న, గయాసుద్దీన్, అలీహుస్సేన్, షాహీద్ తదితరులు ఉన్నారు.